క్లుప్తంగా

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే



తిరుమలలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: తిరుమల శ్రీవారిని సోమవారం చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులు దర్శించుకున్నారు. ఆయనతో పాటు చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, కార్పొరేటర్ జ్ఞానజగదీష్ ఉన్నారు.

108లో ప్రసవం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర పరిధిలోని మాపాక్షి చెందిన గర్భిణి తేజోవతికి సోమవారం ఉదయం పురుటి నొప్పులు అధికమయ్యాయి. కుటుంబీకులు 108లో చిత్తూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే ఆ గర్భిణి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మెడికల్ టెక్నీషియన్, డ్రైవర్, గర్భిణి తల్లి సాయంతో సురక్షిత ప్రసవం చేశారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది పేర్కొన్నారు.

వలంటీర్లకు సన్మానం



వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్ : ప్రభుత్వ పథకాలపై వలంటీర్లు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగరంలోని 9, 10, 11, 12 డివిజన్లలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఆయన వలంటీర్లను సన్మానించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులు

బంగారుపాళెం: స్థానిక చర్చిలో పిల్లలకు లైట్ ఆఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు సీబీసీ శిక్షణా తరగతులను నిర్వహించారు. చివరి రోజు సోమవారం పిల్లలకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. రెవరెండ్ సామ్యూల్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ బెన్నురాజ్

బంగారుపాళెం: స్పందన కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ బెన్నురాజ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందనలో భాగంగా ఆయన వినతులు స్వీకరించారు. పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులు, భూ సమస్యలు, శ్మశాన స్థల సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం స్పందన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గుడిపాలకు చేరిన వేరుశనగ విత్తనాలు



గుడిపాల: మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాలకు వేరుశనగ విత్తనకాయలు వచ్చినట్లు వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. సోమవారం ఆమె మాటాడుతూ గుడిపాల మండలానికి 1,020 క్వింటాళ్లు వేరుశనగ విత్తనాలు రావాల్సి ఉండగా ఇప్పటివరకు 400 క్వింటాళ్లు వచ్చాయని చెప్పారు. వారం రోజుల్లో మిగతావి వస్తాయన్నారు. 30 కిలోల బస్తా రూ.1,476గా ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తుచేశారు.

కొటాలలో 'కంటి వెలుగు'



రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులు

యాదమరి: మండలంలోని కొటాల సచివాలయ పరిధిలో సోమవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అవ్వతాత కంటి వెలుగు కార్యక్రమాన్ని కొటాల ఆరోగ్య ఉపకేంద్రంలో ఆప్తాలమిక్ అసిస్టెంట్ మంజువాణి చికిత్స నిర్వహించారు. దీనికి 61 మంది వృద్ధులు హాజరై కంటి పరీక్షలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దివ్యశ్రీ, మహిళ ఆరోగ్యకార్యకర్త శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊరూరా జాతర!

చిత్తూరు మండలంలో గంగజాతర అంటే ఓ ప్రత్యేకం. ఒకప్పుడు చిత్తూరుకు మాత్రమే పరిమితమైన ఈ జాతర కొన్నేళ్లుగా మండలంలోని ఊరూరా జరుపుకుంటూ వస్తున్నారు. ఆయా నడివీధుల్లో గంగమ్మను కొలువుదీర్చి సంబరాలు చేసుకుంటున్నారు. అమ్మవారికి విశేష పూజలందిస్తూ జలధి చేస్తున్నారు. ఈ మంగళ, బుధవారాల్లో గ్రామాల్లో జాతరకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ జాతరను చిత్తూరులో రెండు రోజులపాటు నిర్వహిస్తారు.

- నేడు రేపు జాతరకు ముమ్మర ఏర్పాట్లు
- గ్రామాల్లో సిద్ధమైన మండపాలు
- పలువురికి జీవనోపాధి

చిత్తూరు రూరల్: గతంలో ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధుల వ్యాప్తికి జనం తల్లడిల్లిపోయేవారు. 350 ఏళ్ల క్రితం ప్లేగు, మలేరియా వంటి భయానక వ్యాధులు ఊళ్లను కబళించేస్తుంటే అంతా హడలిపోయారు. ఈ క్రమంలో ఊరంతా ఏకమైంది. చెడు జరిగిందని భావించి, గంగమ్మను కొలవడం ప్రారంభించారు. క్రమంగా వ్యాధులు మటుమాయమయ్యాయి. ఎండలు తీవ్రత తగ్గి, వర్షాలు సంవృద్ధిగా వర్షాలు కురిశాయి. దీంతో ప్రజలకు గంగమ్మ అంటే అపారమైన నమ్మకం కలిగి ప్రజలకు కొంగు బంగారంగా మారింది. ఈ భక్తితో గంగజాతరను ఊరి పెద్దల సమక్షంలో ఏటా మేలో చేస్తున్నారు. ఒకప్పుడు చిత్తూరు నడివీధిలో మాత్రమే ఈ గంగ జాతర జరిగేది. అప్పటి నుంచి అమ్మవారిని కొలిస్తే, కోర్కెలు ఇట్టే నెరువేరుతాయనే నమ్మకం ప్రజల్లో బాగా నాటుకుపోయింది. దీంతో అమ్మవారిపై భక్తిభావం పెంపొంది, పక్క గ్రామాల్లో కూడా గంగజాతర చేయడం ప్రారంభమైంది. ఇప్పుడు పలు చోట్ల గంగజాతరను మహోత్సవంగా జరిపిస్తూ వస్తున్నారు.

చిత్తూరు నగరంలోని గత మంగళ, బుధవారాల్లో నడివీధి గంగజాతర ముగిసింది. దీంతోపాటు కొంగారెడ్డిపల్లి, సంతపేట, గిరింపేట, దొడ్డిపల్లి, మురకంబట్టు ప్రాంతాల్లో పూర్తయ్యాయి. తరువాత మంగళ, బుధవారాల్లో మురుగానిపల్లి, కట్టమంచి, తోబనపల్లి, మూడవగేటు, సాంబయ్యకండ్రిగ, గువ్వకల్లు, తాళంబేడు, జంబుగోళంపల్లి తదితర ప్రాంతాల్లో జాతరను అట్టహాసంగా నిర్వహించనున్నారు. తరువాత వారంలో మరికొన్ని గ్రామాల్లో చేసేందుకు ఊరి పెద్దలు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో చాటింపు వేసి జాతర ఏర్పాట్లను ముమ్మరంగా చేపడుతున్నారు. అమ్మవారిని ప్రతిష్ఠించే చోట చలువపందిరి, మండపాలు సిద్ధమయ్యాయి. విద్యుత్‌దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. నాటక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలకు, డప్పు వాయిద్యాలకు బుకింగ్ చేసుకుంటున్నారు. జాతరలో పలువురు జీవనోపాధి పొందుతున్నారు.

జీవనోపాధి ఇలా...

జాతరంటే ఊరూవాడ సంబరంలో మునిగితేలుతుంటుంది. రెండు రోజులపాటు అమ్మవారికి పూజలందించడంతోపాటు ఆటపాటలతో సందడి చేస్తుంటారు. ఈ సందడి పలువురి కడుపు నింపుతోంది. చిన్న వ్యాపారులు రెండు రోజుల జాతర బతుకు బండిని నడిపిస్తోంది. పలు వృత్తుల వారి జీవనోపాధికి గంగ జాతర వరంలా మారుతోంది.

- ప్రధానంగా అమ్మవారి మండపానికి సమీపంలో పూజాసామగ్రి, పూలు, నిమ్మకాయ, కొబ్బరికాయ, చిన్న పూలదండలు అమ్ముతుంటారు. మొక్కులు చెల్లించే భక్తుల దృష్ట్యా రాగి, ఇత్తడితో చేసిన వస్తువులను విక్రయిస్తుంటారు. ఇలాంటి వ్యాపారాలంటే ఆ మండపం దారిపొడవునా క్యూ కడుతుంటాయి.
- చిన్న చిన్న గుడిసెలు వేసి పిల్లల ఆటవస్తువులు, బొమ్మలు విక్రయిస్తుంటారు. తరువాత గాజుల బండ్లు కనిపిస్తుంటాయి. ఈ బండ్లు మహిళలను విపరీతంగా ఆకర్షిస్తుంటాయి.
- ఐస్‌క్రీమ్ వ్యాపారం, కూల్ డ్రింక్స్, పలు రకాల తినుబండారాలు విక్రయాలు జరుగుతుంటాయి.
- అమ్మవారి చిత్రపటాలతోపాటు వివిధ రకాల దేవుళ్ల చిత్రపటాలు విక్రయించనున్నారు.





మురుగానంపల్లిలో గంగజాతరకు ముస్తాబైన మండపం, ప్రత్యేక అలంకరణలో గంగమ్మ(ఫైల్)

కళాకారులకు ప్రోత్సాహం

జాతరంటే ముందు గుర్తుకొచ్చేది వీధినాటకాలే. 13 ఏళ్ల క్రితం నాటక కళాకారులకు మంచి డిమాండ్ ఉండేది. జాతర సమయంలో కళాకారులు దొరికే వారే కాదు. కాలక్రమేణా టీవీలు, సెల్‌ఫోన్ ప్రభావంతో నాటక కళాకారులకు డిమాండ్ తగ్గింది. రెండేళ్ల కోవిడ్ ప్రభావంతో జాతర జరగలేదు. ఈ సారి అన్ని చోట్ల ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు ప్రతి చోటా వీధి నాటక కళాకారులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవడం విశేషం.

శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించినట్లు ఈఓ మునిరాజులు తెలిపారు. స్వయంభు మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు రాహు, కేతు, సర్ప దోష నివారణ పూజలు చేపట్టారు. దీనికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జేవీకే కిట్లు సిద్ధం చేయండి



కిట్లను పరిశీలిస్తున్న వెంకటరమణారెడ్డి

గుడిపాల: జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను సిద్ధం చేయాలని జిల్లా సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి, డీఈవో విజయేంద్రరావు అన్నారు. నరహరిపేట పాఠశాలలో సోమవారం జగనన్న విద్యాకానుకకు సంబంధించి యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, ఇతరత్రా వస్తువులను వారు తనిఖీ చేశారు. క్వాలిటీ ప్రకారం వచ్చిందా లేదా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వచ్చిన మెటీరియల్ ప్రకారం అన్ని ఒకేసారి కిట్‌గా తయారుచేసి వారికి అందజేయాలని వారు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రామ్‌నాయక్, సీఆర్‌పీ పాల్గొన్నారు.

వజ్రాలపురం గంగమ్మ జాతర ప్రారంభం



ప్రత్యేక అలంకారంలో వజ్రాలపురం బోయకొండ గంగమ్మ

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురంలో వెలసిన శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మ జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. జాతరలో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలను నిర్వహించారు. అనంతరం కలశ స్థాపన, ధ్వజారోహణ, గణపతి హోమం, చండీహోమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 11 గంటలకు భక్తి సంకీర్తనలు, భజన కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలకు ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, దీప, గోపి, చాతుర్య, పురుషోత్తం, కొమ్మినేని ఉషా, నరేష్, మమత, ఈశ్వర్‌నాయుడు, శివలింగయ్య, ఉభయదారులుగా వ్యవహరించారు. మంగళవారం అమ్మవారికి అంబలి, పొంగళ్లను సమర్పించనున్నారు. అనంతరం అమ్మ నిజరూప దర్శనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాల అమలు

- గడపగడపకు మన ప్రభుత్వంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



లబ్ధిదారుతో మాట్లాడుతున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని వావిల్‌తోట, నొచ్చుపల్లి, పెరుమాళపల్లి, పొత్తూరు, ఈడిగపల్లి, వెంకటాపురం గ్రామాల్లో ఆయన సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో లబ్ధి పొందిన బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వానికి జగనన్న పాలనకు మధ్య తేడాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్య, నాణ్యమైన భోజనం అందిస్తోందని గుర్తుచేశారు. వావిల్‌తోట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రజలు కాలువలు, రోడ్లు, ఇంటి స్థలాలు, కరెంటు స్తంభాల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. వీటికి స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు అర్జీలతో కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోకపోవడం వల్లే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని చెప్పారు. ఇంకా నిర్లక్ష్యం వహిస్తే బదిలీలపై వెళ్లటానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, రాజారత్నం రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ దేవిక, వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షులు జయచంద్రారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ మహేశ్వరి, మండలాధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు వావిల్‌తోటలో...

మండలంలోని వావిల్‌తోట పంచాయతీ పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 7 గంటలకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలని ఆదేశించారు.

కలసికట్టుగా పనిచేద్దాం



మంత్రిని కలిసిన ఎంపీ రెడ్డెప్ప,ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, నాయకులు

పూతలపట్టు(యాదమరి): అందరు కలసికట్టుగా పనిచేసి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుందామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి పూతలపట్టు మండల వైఎస్సార్‌సీపీ నాయకులను కోరారు. తిరుపతిలోని మంత్రి నివాసంలో సోమవారం సాయంత్రం చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆధ్వర్యంలో మండల నాయకులు మంత్రి పెద్దిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో అభివృద్ధిపనులు, సమస్యలపై చర్చించారు. మండలంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తలపులపల్లె బాబురెడ్డి, కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మొగిలీశ్వరుని సేవలో జెడ్పీ చైర్మన్



మొగిలీశ్వరస్వామిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలీశ్వరస్వామిని జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్ దేవరకొండపై వెలసిన శ్రీ జలకంఠేశ్వరస్వామి ఆయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమశేఖర్ పాల్గొన్నారు.

నీటి నిల్వపై అవగాహన అవసరం



పుత్రమద్దిలో చెరువు పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఐరాల: నీటి నిల్వ ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు సచింద్రకుమార్‌సింగ్, సోమరేంద్రసింగ్ అభిప్రాయపడ్డారు. మండలంలోని కాణిపాకం, వడ్రాంపల్లె, చిన్నకాంపల్లె, పుత్రమద్ది, వేదగిరివారిపల్లెలో సోమవారం వారు పర్యటించారు. వారు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం, ఇరిగేషన్ కింద చేపట్టిన వ్యవసాయ చెరువు, అమృత్‌సరోవర్, కందకాల పనులను పరిశీలించారు. ముందుగా కాణిపాకం అవెన్యూ ప్లాంటేషన్‌ను సందర్శించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలు ఏపుగా పెరగడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టడం ద్వారా నీటినిల్వ ప్రాధాన్యతలో సాధించిన అభివృద్ధిపై అభినందించారు. అనంతరం వేదగిరివారిపల్లెలో అమృత్ సరోవర్ కింద చేపట్టిన చెరువు అభివృద్ధి పనులపై ఆరా తీశారు. నీటినిల్వ కోసం కందకాల పనులు, ఇంకుడు గుంతలు మెరుగైన ఫలితాలిచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవాని, ఏపీడీ సునీల్‌కుమార్, ఏపీఓ సంధ్య పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రైవేటు దందాపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ల్యాబ్‌టెస్టుల పర్వంపై 'సాక్షి' దినపత్రిలో సోమవారం 'ప్రభుత్వాస్పత్రిలో ప్రైవేటు దందా' పేరుతో వార్త కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై ఏపీవీపీ కమిషనర్ స్పందించారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని డీసీహెచ్‌ఎస్ బీఎస్‌కే నాయక్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఆయన అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని పిలిపించి మాట్లాడారు. ఓ అధికారి మాట్లాడుతూ, ఈ విషయం ముందే తనకు తెలుసని, దీనిపై ప్రశ్నించినందుకు తనను దూసించడంతో వదిలేశానని చెప్పుకొచ్చారు. మంగళవారం స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. దందాకు పాల్పడుతున్న వ్యక్తులపై ఆరా మొదలు పెట్టారు. చివరకు ఆస్పత్రిలో ప్రైవేటు దందా వాస్తవమేనన్న విషయం డీసీహెచ్‌ఎస్ దృష్టికి వచ్చింది. దీనిపై మరింత లోతైన విచారణ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నరసింహారెడ్డి

బంగారుపాళెం: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు దృష్టి సారించి సమాచారం అందించాలని సీఐ నరసింహారెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పర్యటించి అసాంఘిక కార్యకలాపాలు సాగించే వ్యక్తులపై నిఘా పెట్టి తమకు సమాచారం అందించాలన్నారు. మహిళలు, యువతులపై జరిగే దాడులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మహిళా భద్రతకు ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ చట్టాలపై గ్రామాల్లో మహిళలు, యువతులకు చైతన్యం కల్పించాలని చెప్పారు. దిశ యాప్ పనితీరును వివరించాలన్నారు. బడిమానేసిన పిల్లలను ఉపాధ్యాయులతో కలిసి బడిలో చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు.

'స్పందన' వినతులకు అధిక ప్రాధాన్యం

చిత్తూరు అర్బన్ : స్పందనకు వచ్చే వినతులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని నగర కమిషనర్ అరుణ అన్నారు. నగర పాలక కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరపాలక పరిధిలోని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో భాగంగా ఇంజినీరింగ్ 3, ప్రణాళిక శాఖ -1, ప్రజారోగ్య విభాగం -1 చొప్పున మొత్తం 5 వినతులు అందాయి. సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. స్పందన వినతులకు సంబంధించి అధికారులు క్షేత్రస్థాయి విచారణ జరిపి పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. ఈ స్పందన కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో డా.లోకేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

చిత్తూరు అర్బన్: నగరానికి చెందిన ఓ మహిళ అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తానపల్లెట్టి వీధికి చెందిన రాజేష్ భార్య అశ్రీన్ శనివారం గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నగరంలో విస్తృతంగా 'మేరీ లైఫ్'



అవగాహన కార్యక్రమంలో వలంటీర్లు, సిబ్బంది

చిత్తూరు అర్బన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'మేరీ లైఫ్' కార్యక్రమాలను నగరంలో విస్తృతంగా నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ అరుణ అన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మేరీ లైఫ్' కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలను భాగస్వాములను చేస్తూ వివిధ రకాల కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ఒక్కో రోజు ఒక్కో అంశంతో క్షేత్రస్థాయిలో వార్డు కార్యదర్శులు కార్యక్రమాల నిర్వహిస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని వివరించారు. అందులో భాగంగా నగరంలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో సోమవారం స్థానికంగా, సీజనల్‌గా లభించే ఆహార పదార్థాలు, పండ్లు ఉపయోగాలను వివరించారు. నగరంలో రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ కేంద్రాలను ఏర్పాటు చేసి గృహాల్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను జూన్ 5వ తేదీ వరకు సేకరించనున్నట్లు వివరించారు.

ఫ్యామిలీ డాక్టర్‌కు అనూహ్య స్పందన





పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ఎగువ మారేడుపల్లెలో సేవలందిస్తున్న డాక్టర్ ప్రియాంక

ఐరాల: మండలంలోని నాంపల్లెలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ సోమవారం 104 వైద్య శిబిరంలో 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి చికిత్స చేశారు. సీహెచ్‌ఓ సుగుణవతి, హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎగువ మారేడుపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని ఎగువ మారేడుపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి ప్రియాంక 97 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ భార్గవి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.